కడ్తాల్ మండల పరిధిలోని మక్తమాధారం వేణుగోపాలస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను బ్యాండు వాయిద్యాలతో మండపానికి తీసుకువచ్చారు. కల్యాణం అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త, అర్చకుడు తిరుమల వింజమూరి రామానుజాచార్యులు, ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మంజుల చంద్రమౌళి, బొప్పిడి గోపాల్, సులోచన సాయిలు, పాల్గొన్నారు. కడ్తాల్ ,ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి)



కనుల పండువగా రథోత్సవం

ఆమనగల్లు మండలం శెట్టిపల్లి శ్రీ అలివేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారు జామున స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. తోరణాలు, పుష్పాలతో రథాన్ని అలంకరించారు. దానిపై ఉత్సవ మూర్తులను ఉంచి భక్తులు తాళ్లతో లాగి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులు ఆలయంలో స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, ఆలయ చైర్మన్ సింగిని శ్రీనివాస్ , ఆలయ ట్రస్టీ కోట్ల జగన్మోహన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు, అర్చకులు గూడ కృష్ణమాచార్యులు, నాయకులు బి. వెంకటేశ్, వెంకటయ్య, రమేశ్, వీరాచారి, జంగయ్య గౌడ్, వెంకటాచారి, చంద్రమౌళి, నర్సింహ్మా, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

-ఆమనగల్లు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి)

కల్యాణం.. కమనీయం



కన్హాశాంతివనంలో ఆదిశక్తి మహోత్సవం

- ఘనంగా బాబూజీ మహరాజ్ జయంత్యుత్సవాలు
- హాజరైన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్



ఆదిశక్తి మహోత్సవంలో రామ్‌నాథ్ కోవింద్, గజేంద్రసింగ్ షెకావత్, గురూజీ కమలేష్ పటేల్

నందిగామ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నందిగామ మండల పరిధిలోని కన్హాశాంతి వనంలో రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆదిగురువు బాబూజీ మహరాజ్ జయంతి సందర్భంగా ఆదిశక్తి మహోత్సవం 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు ఘనంగా నిర్వహించినట్లు రామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌లు హాజరయ్యారని వారు రామచంద్రమిషన్ గురూజీ పద్మభూషణ్ అవార్డు గ్రహీత కమలేష్ డి పటేల్ రచించిన స్పిరిచ్యువల్ అనాటమీ, హెలెన్ ఫైరెట్ రాసిన 'ఏ సింఫనీ ఆఫ్ లవ్' పుస్తకాలను ఆవిష్కరించినట్లు వెల్లడించారు. రామ్‌నాథ్ కోవింద్ మూడు రోజుల పాటు కన్హాశాంతివనంలోనే ఉండి గురూజీ కమలేష్ పటేల్‌తో కలసి పలు ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారని చివరి రోజు కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ కార్యక్రమంలో పాల్గొని వారితో కలసి ధ్యానం చేశారని తెలిపారు. అనంతరం కన్హాశాంతివనం ఆవరణలో వారు మొక్కను నాటారన్నారు. కార్యక్రమంలో రాంచంద్రమిషన్ ప్రతినిదులు, అభ్యాసకులు తదితరులు పాల్గొన్నారు.



మాకేది భరోసా?

రైతుభరోసా పథకం ద్వారా అందజేసే పెట్టుబడి సాయం ఇప్పటికే ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతులకు అందించారు. దీంతో మిగతా గ్రామాల రైతులు 'మాకేది భరోసా' అంటూ ఆశగా ఎదురుచూస్తున్నారు. తొలివిడతలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 46 గ్రామాల్లోని 26,843 మంది రైతులకు రూ.35.36 కోట్ల సాయాన్ని అందించారు. కాగా, మలి విడత కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. త్వరలోనే అర్హులందరికీ రైతు భరోసా అందుతుందని వ్యవసాయ అధికారులు చెబుతుండటం గమనార్హం.



తొలి విడతలో పెట్టుబడి సాయం పంపిణీ ఇలా

జిల్లా	గ్రామాలు	రైతులు	రూ.కోట్లలో
రంగారెడ్డి	21	15,531	20.25
మేడ్చల్	05	2,703	3.93
వికారాబాద్	20	8,609	11.18

ఆశగా ఎదురుచూస్తున్న రైతులు

- తొలివిడతలో 26,843 మంది రైతులకు లబ్ధి
- ఉమ్మడి జిల్లాలో రూ.35.36 కోట్లు విడుదల
- మలి విడతపై మిగతా రైతుల ఆశలు
- రైతుభరోసాకు 1,082 గ్రామాల రైతుల నిరీక్షణ

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ రైతుకు జనవరి 26 తర్వాత 'భరోసా' అందుతుందని ప్రభుత్వ వర్గాలు చెప్పడంతో అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో 7,01,322 ఎకరాలు, వికారాబాద్ జిల్లాలో 6,42,006 ఎకరాలు, మేడ్చల్ జిల్లాలో 64,860 ఎకరాల సాగు భూములకు పెట్టుబడి సాయం అందాల్సి ఉంది. కాగా, తొలి విడతగా రంగారెడ్డి జిల్లాలో 21 మండలాల్లో 21 గ్రామాలను ఎంపిక చేసి 15,531 రైతుల ఖాతాల్లో రూ.20.25 కోట్లు జమ చేశారు. అలాగే మేడ్చల్ జిల్లాలో ఎంపిక చేసిన 5 గ్రామాల్లో 2,703 రైతుల ఖాతాల్లో రూ.3.93 కోట్లు, వికారాబాద్ జిల్లాలో 20 గ్రామాల్లోని 8,609 రైతుల ఖాతాల్లో రూ.11.18 కోట్లు జమ చేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 46 గ్రామాల్లో 26,843 రైతుల ఖాతాల్లో రూ.35.36 కోట్లు జమ చేసింది. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ మండలం అన్నారంలో

మిగతా 7వ పేజీలో...



రైతులందరికీ పెట్టుబడి సాయం అందించాలి

రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు భరోసా అందించాలి. ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతులకు పథకాన్ని అమలు చేస్తే మిగితా వారికి ఎప్పుడు ఇస్తారు. రైతు భరోసా ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం ఎంత వరకు న్యాయం. చాలా మంది రైతులు రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా సర్కార్ స్పందించి త్వరగా పథకం వర్తింప చేయాలి.

వై. మల్లేష్, రైతు చేవెళ్ల

దేశానికి కప్పు అందించడం సంతోషంగా ఉంది

- తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే క్రికెట్‌లో రాణిస్తున్నా
- మిథాలీరాజ్ నాకు స్ఫూర్తి .. మహిళా క్రికెటర్ త్రిష
- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో త్రిషకు స్వాగతం పలుకుతున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, కుటుంబ సభ్యులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అండర్- 19 వరల్డ్ కప్ దేశానికి అందించడంలో కీలక పాత్ర పోషించినందుకు చాలా సంతోషంగా ఉందని మహిళా క్రికెటర్ గొంగిడి త్రిష అన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన త్రిషకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, తల్లిదండ్రులు, క్రికెట్ అభిమానులు శాలువలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా త్రిష మాట్లాడుతూ... కౌలాలంపూర్‌లో జరిగిన అండర్-19 ప్రపంచ కప్ ఫైనల్‌లో దక్షిణాఫ్రికను చిత్తుగా ఓడించినందుకు ఆనందంగా ఉందన్నారు. క్రికెట్‌లో రాణిస్తున్నానంటే నా తల్లిదండ్రులే కారణమని చెప్పారు. కప్ గెలవడంలో సహచర క్రికెటర్ల పాత్ర మరువలేనిదన్నారు. భారత మహిళ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ తనకు స్ఫూర్తి అని చెప్పారు. వరల్డ్‌కప్‌లో సెంచరీ చేయడంతో కాన్ఫిడెన్స్ పెరిగిందన్నారు. గత ప్రపంచ కప్‌లో సరైన అవకాశాలు రాలేదని, ఈసారి పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకున్నానన్నారు. మున్ముందు మరింతగా రాణించేందుకు కృషి చేస్తానన్నారు.

దివ్య సాకేతంలో రథసప్తమి వేడుకలు

- అహోబిల జీయర్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముచ్చింతల్‌లోని దివ్య సాకేతంలో రథసప్తమి వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. అహోబిల జీయర్‌స్వామి ఆధ్వర్యంలో ఆరోగ్య, ఆయుష్ అభివృద్ధికి అరుణ పారాయణ హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యప్రభ వాహనంపై సాకేత శ్రీరామచంద్రుడు దర్శనం ఇచ్చారు. వేడుకలకు భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా అహోబిల జీయర్‌స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు, మంగళ శాసనాలు అందజేశారు.

శ్రామిక వర్గాలకు వ్యతిరేకంగా కేంద్ర బడ్జెట్

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి



ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 4 (ఆన్‌లైన్): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగం, శ్రామిక వర్గాలకు వ్యతిరేకంగా ఉందని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి అన్నారు. ఈ బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో సబ్సిడీలను తగ్గించారన్నారు. ఒక్క ఎరువుల రాయితీలోనే రూ.11 వేల కోట్లు కోత పెట్టారంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది బీజేపీ ఎంపీలున్నా నిధులు రాబట్టలేకపోయారన్నారు. రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీలుంటే వివక్ష చూపుతారా అని ప్రశ్నించారు. ప్రభుత్వాలు ఏవైనా ప్రజల కోసం పనిచేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు చల్లా నారాయణరెడ్డి, జి.బాల్‌రాజ్, ఎస్.బాల్‌రెడ్డి, రజనీకాంత్, పురుషోత్తం పాల్గొన్నారు.

ఆశ్రమ భూములు విక్రయిస్తే సహించం

- మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు

షాద్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు దాతలు ఇచ్చిన భూములను అన్యాక్రాంతం చేయాలని చూస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ షాద్‌నగర్‌లోని పాత జాతీయ రహదారిని ఆనుకొని సర్వేనంబరు 1391 భూమిని పట్టణానికి చెందిన పలభట్ల వజ్రలింగం 1976లో మలయాళ స్వామి ఆశ్రమానికి కేటాయించారు. ప్రస్తుతం ఆశ్రమ నిర్వాహకులు ఆ భూమిని విక్రయించాలని చూస్తున్నారని ఆరోపించారు. దాతలు విరాళంగా ఇచ్చిన భూములను అమ్మాలని చూస్తే ఊరుకోమన్నారు. దాతలు ఇచ్చిన భూమిలో మలయాళ స్వామి పేరిట వృద్ధాశ్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆశ్రమాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రభుత్వం కూడా స్పందించాలన్నారు.



ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలి

రాష్ట్రఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్య పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని రాష్ట్రఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల మండలాల్లో మంగళవారం శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు కల్పించి అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆహార పదార్థాలు కల్తీ కాకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సురమల్ల సుభాష్, నిరంజన్, అనిల్, సుమన్ నాయక్, సతీష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్ సర్కార్

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా అబద్ధాలతో కాంగ్రెస్ సర్కార్ కాలం వెళ్లదీస్తోందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రజాక్షేత్రంలోనే ఈ సర్కార్ తీరును ఎండగడతామంటూ ఆయన హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ నియోజకవర్గ కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత శాసనసభ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి మహిళలకు ఫ్రీ బస్సు మాత్రమే అమలు చేస్తోందని ఆయన అన్నారు. బస్సుల సంఖ్య తగ్గించడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ సక్రమంగా అందడం లేదన్నారు. రెండు లక్షల రూపాయల రుణ మాఫీ సగం మంది రైతులకు అందలేదన్నారు. అరకొరగా అందుతున్న ఈ పథకాలను సంపూర్ణంగా అమలు చేస్తున్నట్లు చెప్పుకోవడం సిగ్గుచేటని ఆయన విమర్శలు చేశారు. కేసీఆర్ పాలనలో విడుదల చేసిన రూ.7600 కోట్ల రైతు బంధు నిధులు గత పార్లమెంట్ ఎన్నికల ముందు రైతుల ఖాతాల్లో వేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా రైతు భరోసా నిధులు ఇవ్వలేదంటూ ఆయన నిప్పులు చెరిగారు. రెండు సార్లు రైతు భరోసా నిధులు ఎగ్గొట్టి ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల కోసం పథకాల పేరిట నాటకాలాడుతున్నారంటూ ఆయన మండిపడ్డారు. నాట్లప్పుడు ఇవ్వాల్సిన డబ్బులు ఓట్లప్పుడు ఇవ్వడమనేది కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వైఖరికి నిదర్శనమన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు, నాలుగు వేల నిరుద్యోగ భృతి, ఐదు లక్షల విద్యా భరోసా కార్డు, విద్యార్థినిలకు స్కూటీలు, మహిళలకు రూ.2500, వృద్ధులకు రూ.4000 పింఛన్, దివ్యాంగులకు రూ.6000 పింఛన్, కల్యాణలక్ష్మికి అదనంగా తులం బంగారం, దళితబంధు ఏమైనాయంటూ ఆయన ప్రశ్నించారు. మాట తప్పిన కాంగ్రెస్ సర్కార్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈనెల 6 నుంచి మండలాల వారీగా బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు బుగ్గరాములు, చీరాల రమేష్, కిషన్‌గౌడ్, కార్యదర్శులు బహదూర్ నాయక్, భాస్కర్‌రెడ్డి, పి.బాష, ప్యాక్స్ చైర్మన్లు రాజేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు జక్క రాంరెడ్డి పుల్లారెడ్డి, చక్రవర్తి గౌడ్, విఠల్‌రెడ్డి, నర్సింగ్ వెంకటేష్‌గౌడ్, చంద్రయ్య, కృపేష్, ఏనుగు భరత్‌రెడ్డి, బద్రినాథ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

తాండూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తాండూరుకు చెందిన వినాయక సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ సంగీత, వైద్యులు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





హామీలు అమలు చేసి ధర్నాలకు దిగండి

- కాంగ్రెస్‌పై విష్ణువర్ధన్‌రెడ్డి మండిపాటు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి, పక్కన నాయకులు

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజలను పక్కదారి పట్టించాలన్న కుట్రతో కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ పార్టీ ధర్నాలు చేయడం అన్యాయం అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. షాద్‌నగర్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీనైనా పూర్తిగా అమలు చేశారా? అని ప్రశ్నించారు. హైవేలను, రైల్వేలను, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తూ వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ దేశాన్ని అగ్రభాగాన నిలుపుతున్న కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ నేతలు, నాయకులు పసలేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమీ ఇవ్వలేదని ఎమ్మెల్యేలు, మంత్రులు ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. రైతు రుణమాఫీ, ఏడాదికి ప్రతీ ఎకరాకు 15వేలు, వ్యవసాయ కూలీలకు ఏటా 12వేలు, పేద మహిళలకు ప్రతి నెలా 2,500సాయం, 4వేల పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, జర్నలిస్టులకు, తెలంగాణ ఉద్యమకారులకు ఇండ్ల స్థలాల పంపిణీ వంటి కాంగ్రెస్ హామీల్లో ఎన్ని పూర్తిగా అమలుచేశారో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద, చించోడ్‌లను మండలాలుగా చేస్తే ఎమ్మెల్యే సొమ్మేమైనా పోతుందా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి మొగిలిగిద్దకు వచ్చినప్పుడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మండలంగా ఎందుకు ప్రకటింపజేయలేదన్నారు. కుల గణన సర్వే జాబితాలో క్రిస్టియన్ల జనాభా వెల్లడించలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏమీ ఇవ్వలేదని ప్రజలను తప్పుదోవ పట్టిస్తే ప్రజలు క్షమించబోరని విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు మోహన్‌సింగ్, లష్కర్‌నాయక్, శ్రీనివాస్, రుషికేష్, రాజు, మహేందర్‌రెడ్డి, గణేష్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల పండుగ.. కాంగ్రెస్‌కు కడుపు మంట


ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అందె బాబయ్య, ఇతర నాయకులు

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌తో ప్రజలు పండుగ చేసుకుంటుంటే.. కాంగ్రెస్‌కు మాత్రం కడుపు మండుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య విమర్శించారు. దేశాభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసి కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని హర్షిస్తూ బీజేపీ నాయకులు మంగళవారం షాద్‌నగర్ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పార్టీ పట్టణాధ్యక్షుడు హరి భూషణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బాబయ్య హాజరై మాట్లాడారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు, రైతులు హర్షించేలా కేంద్రం బడ్జెట్ ఉందన్నారు. దీనిని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఓర్చుకోలేరని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.మురళి, పి.సురేష్, జె.నర్సింహ, ఎం.విజయ్, ఎం.రాము, జి.విజయ్, శ్రీనాథ్, రామకృష్ణ, మణికంఠ, ఆంజనేయులు, రవినాయక్ పలువురు పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సింగపూర్‌కు చేరుకున్న డాక్టర్ రవీందర్‌రెడ్డి

సింగపూర్ సదస్సుకు షాద్‌నగర్ అధ్యాపకుడు

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో జరుగుతున్న అంతర్జాతీయ సెమినార్‌కు షాద్‌నగర్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి మంగళవారం హాజరయ్యారు. సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్ ప్రతినిధి ప్రొఫెసర్ థాం షాంఫైని కలిశానని ఆయన తెలిపారు. అంతర్జాతీయ సెమినార్‌లో వాతావరణం అనే అంశంపై మాట్లాడేందుకు అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నాని తెలిపారు.

బోగస్ ఓట్లపై అధికారుల విచారణ

నందిగామ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొదళ్లగూడ గ్రామ పంచాయతీ పరిధిలో స్థానికేతరులకు ఓట్లు ఉన్నాయని మొదళ్లగూడకు చెందిన యాదగిరిరెడ్డి షాద్‌నగర్ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. రెవెన్యూ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి మొదళ్లగూడ, మంచన్‌పాడు, సింబియాసిస్ యూనివర్సిటీ, మజీద్ మామిడిపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాలను తనిఖీ చేశారు. స్థానికేతరుల, 18ఏళ్లు నిండినివారి పేర్లను పరిశీలించారు. బోగస్ ఓట్లున్నాయనే ఫిర్యాదుతో విచారణ చేశామని, బోగస్ ఓట్లు తేలితే ఆ పేర్లను తొలగిస్తామని అధికారులు చెప్పారు. విచారణలో అధికారులు రాజు, రవి, శ్రీనివాస్, ఉదయ్, ప్రవళిక, మంగమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.


సింబియాసిస్ యూనివర్సిటీలో బోగస్ ఓట్లపై విచారణ చేస్తున్న అధికారులు



వీధి దీపాలకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తాండూరులోని అంబేడ్కర్ చౌక్ నుంచి ఇందిరాచౌక్ వరకు వెళ్లే రోడ్డు మార్గంలోని హైమాస్ట్, ఎల్ఈడీ లైట్లకు మంగళవారం మరమ్మతులు చేశారు. ప్రధానంగా అంబేడ్కర్ చౌక్‌లో లైట్లు వెలగక చీకటి నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని జనవరి 24న 'వీధి లైట్ల ఏర్పాటులో విఫలం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించి వీధిలైట్లకు మరమ్మతులు చేయించారు. హైమాస్ట్ లైట్లను రిపేర్‌తో ప్రజలకు ఇబ్బందులు తొలిగాయి.


ఇందిరాచౌక్-అంబేడ్కర్ చౌరస్తా రోడ్డులో లైట్లు రిపేర్ చేస్తున్న ఎలక్ట్రీషియన్లు

మార్కెట్ ఫీజు ఎగవేత నివారణకు స్పెషల్ డ్రైవ్


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ధారూరు, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ఏడు కిలోల తరుగు, నాలుగు శాతం కమీషన్ శీర్షికన వ్యాపారులు రైతులకు, మార్కెటింగ్ శాఖకు చేస్తున్న మోసాలను వివరిస్తూ మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో గ్రామాల్లో జీరో వ్యాపారాన్ని నిరోధించేందుకు మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహణకు మంగళవారం వివిధ స్థాయిల అధికారులతో ఒక టీంను ఏర్పాటు చేశారు. ఈ టీంకు ధారూరు మార్కెట్ కమిటీ సహాయ కార్యదర్శి సిద్ధమ్మను లీడర్‌గా నియమించారు. బృందంలో కొడంగల్, పరిగి, ధారూరు, వికారాబాద్ ఏఎంసీల కార్యదర్శులు, నలుగురు మార్కెటింగ్ సూపర్‌వైజర్లు, ప్రతీ వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి ఇద్దరు చొప్పున సెక్యూరిటీ గార్డులుంటారు. ధారూర్, పరిగి, కొడంగల్, తుంకిమెట్ల ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ చేసి గ్రామాల్లో రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొంటున్న వ్యాపారులను గుర్తించి వారి నుంచి మార్కెట్ ఫీజు వసూలు చేసి, తూకాల్లో మోసం, తరుగు, కమీషన్ వసూళ్లను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. ఈ టీం బుధవారం నుంచి తన డ్రైవ్ నిర్వహిస్తుంది. కాగా రాంపూర్ తండాలో వేరుశనగ బస్తాలను తరలిస్తున్న రెండు డీసీఎంలను నిలిపి మార్కెట్ ఫీజు వసూలు చేశామని మంగళవారం అధికారి సిద్ధమ్మ తెలిపారు. 165 పల్లి బస్తాలకు రూ.9,570 మార్కెట్ ఫీజును వసూలు చేశామని చెప్పారు. జిల్లాలో వ్యాపారులు మార్కెట్ కమిటీలకు ఫీజులు చెల్లించకుండా ఎక్కడైనా నేరుగా రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొంటున్నా, తూకాల్లో మోసం చేస్తున్నా, దళారులు కమీషన్లు వసూలుచేస్తున్నా వెంటనే రైతులైనా లేదా సాధారణ పౌరులైనా 8310739661 అనే నంబరుకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

దుర్గమ్మ సన్నిధిలో సీనియర్ న్యాయాధికారి



పాపన్నపేట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గ భవానీ మాతను ఇబ్రహీంపట్నం కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి రీటాలాల్ చంద్ మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ మర్యాదలతో సత్కరించారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.








క్రీడలను ప్రారంభిస్తున్న ఎగిరిశెట్టి సత్యం

కొనసాగుతున్న వాలీబాల్ టోర్నీ

ఆమనగల్లు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లిలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు అట్టహాసంగా జరుగుతున్నాయి. యువకులు, విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారు. మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టిగోదాదేవిసత్యంల ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తున్నారు. ఓపెన్ టు ఆల్ నాలుగో రాష్ట్రస్థాయి పోటీల్లో మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, కర్నూల్, ఆత్మకూరు, జడ్చర్ల తదితర ప్రాంతాలకు చెందిన 32టీంలు మంగళవారం రెండో రోజు పాల్గొన్నాయి. బుధవారం పోటీల ముగింపు సందర్భంగా విజేతలకు ఫస్ట్‌ప్రైజ్ రూ.20,116, సెకండ్ రూ.10,116, థర్డ్‌ప్రైజ్ రూ.5,116, షీల్డ్‌లను ప్రదానం చేస్తామని సత్యం తెలిపారు. కార్యక్రమంలో గోదాదేవి, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, పీఈటీలు మహమూద్, ప్రసాద్, మల్లేశ్, సురేశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


ఏట్లఎర్రవల్లి సమీపంలో బ్రిడ్జి పనులను ప్రారంభిస్తున్న సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి

గ్రామీణ రోడ్లకు ప్రభుత్వం పెద్దపీట

షాబాద్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రోడ్లకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి ఏట్లఎర్రవల్లి వద్ద వాగుపై రూ.2కోట్లతో నిర్మించే వంతెన పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుతుందన్నారు. వాగుపై వంతెన లేక వర్షాకాలంలో గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బ్రిడ్జి నిర్మాణంతో ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు తొలగుతాయని అన్నారు. పనులను ముమ్మరంగా చేపట్టి వానకాలం వచ్చేలోగా వంతెనను నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపాల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, వేణుగోపాల్, రాజేందర్‌రెడ్డి, సర్దార్‌ఖాన్, వీరేందర్‌గుప్తా, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, సాయిగణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కరాటేలో మెడల్ సాధించిన ఆరాధ్యరెడ్డిని అభినందిస్తున్న కోచ్‌లు

కరాటేలో రెడ్డిపల్లి బాలికకు వెండి పతకం

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కరాటే పోటీల్లో ఓ బాలిక మెడల్ సాధించింది. రెడ్డిపల్లికి చెందిన కృష్ణారెడ్డి-నవనీతల కూతురు ఆరాధ్య విశాఖపట్నంలో జరిగిన ఓపెన్ శివమొగ్గ-2025 ఎనమిదో ఇంటర్నేషనల్ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చూపి వెండి పతకం గెలిచింది. తమ గ్రామానికి చెందిన ఆరాధ్య కరాటేలో మెడల్ సాధించడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


కానిస్టేబుల్ మానసను అభినందిస్తున్న సీఐ పరశురాం, ఎస్సైలు

మెడల్ సాధించిన కానిస్టేబుల్‌కు సన్మానం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు విధులతో పాటు క్రీడల్లో రాణించడం అభినందనీయమని ఘట్‌కేసర్ సీఐ పందిరి పరశురాం అన్నారు. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ జి.మానస గోల్డ్ మెడల్, రెజ్లింగ్‌లో బ్రోంజ్ మెడల్ సాధించారు. జి.మానస మంగళవారం పోలీసుస్టేషన్‌లో శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సైలు ప్రభాకర్‌రెడ్డి, నర్సింహ, శేఖర్, ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే క్యాన్సర్ దూరం



మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్యశ్రీ

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ముందస్తు జాగ్రత్తలతో క్యాన్సర్ రాకుండా చూసుకోవచ్చని నీలిమ ఆస్పత్రి వైద్యురాలు సౌమ్యశ్రీ అన్నారు. పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్ నీలిమ మెడికల్ కళాశాలలో మంగళవారం జరిగిన ప్రపంచ కాన్సర్ నివారణ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. క్యాన్సర్ రకాలు, కారకాలపై వివరించారు. క్యాన్సర్ నిర్ధారణ, నివారణ పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ అఫ్ ఫార్మసీ డీన్ వసుధభక్షి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మల్లేష్, డాక్టర్లు రాజేంద్రకుమార్, శిరీష, శ్రుతి, సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధి నివారణపై అవగాహన

శామీర్‌పేట: క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతీ విద్యార్థిని అప్రమత్తంగా ఉంటూ వ్యాధి రాకుండా చూసుకోవాలని నివారించాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ అన్నారు. శామీర్‌పేట ప్రభుత్వ గురుకుల డిగ్రీ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ ఇష్రత్ ఆధ్వర్యంలో వరల్డ్ క్యాన్సర్ డే నిర్వహించారు. క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి అని, ఇది రాకుండా నివారణ, జాగ్రత్త చర్యలను తీసుకోవాలన్నారు. సదస్సులో కళాశాల వైద్యురాలు డాక్టర్ భాగ్యలక్ష్మి విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధి నివారణపై పోస్టర్ ప్రజెంటేషన్, పవర్ పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ శానిటరీ న్యాప్కిన్స్‌ను వాడాలి

తాండూరు రూరల్: ప్రతీ గ్రామంలో ప్లాస్టిక్ నిరోధంపై అవగాహన కల్పించాలని అమ్మ ఆదరణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు పేర్కొన్నారు. జినుగుర్తిలో ప్లాస్టిక్ నిరోధంపై ఆశా వర్కర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ప్లాస్టిక్ శానిటరీ న్యాప్కిన్స్‌తో మహిళలకు గర్భాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. క్యాన్సర్ నివారణకు నాబార్డ్, టెక్నోడ్రీమ్ సహకారంతో తయారు చేస్తున్న ఆర్గానిక్ శానిటరీ న్యాప్కిన్స్‌ను ఎన్‌జీవో ఆధ్వర్యంలో గ్రామాల్లో పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆశా వర్కర్లు గ్రామాల్లో అవగాహన కల్పించి మహిళలు వాటిని వాడేలా చూడాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభపై స్వామివారి ఊరేగింపు


లక్ష్మీవేంకటేశ్వరస్వామిని సూర్యప్రభ వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

చేవెళ్ల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గోవింద నామస్మరణతో చేవెళ్లలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం మార్మోగింది. మంగళవారం రథసప్తమిని పురస్కరించుకొని ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి వారికి సూర్యప్రభ వాహన సేవ, హంస వాహనసేవ, సింహ వాహనసేవ, శేష వాహనసేవలను నిర్వహించారు. దీంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నరేందర్, ధర్మకర్తలు వమానాచార్యులు, శ్రీపాద్, కన్నా, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

కొడంగల్: రథ సప్తమి సందర్భంగా కొడంగల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వేడుకలను నిర్వహించారు. సూర్యభగవానుడిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయాన్నే ఆలయానికి పోటెత్తారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా సూర్యప్రభ వాహనంపై వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు. వేంకటేశ్వరస్వామికి పురోహితులు విశేషంగా పాలు, పెరుగు, తేనే, నెయ్యి, పసుపు, చందనం లాంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. కొడంగల్ పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయ ప్రాంగణంలో బారులు తీరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.


కొడంగల్‌లో సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి

మాకేది 'భరోసా'?

(ఐదో పేజీ తరువాయి)



అత్యధికంగా 833 మంది రైతులకు రూ.1.38 కోట్లు, అత్యల్పంగా ధారూరు మండలం, అవుసుపల్లిలో 192 మంది రైతుల ఖాతాలకు రూ.16.16 లక్షలు నగదు రూపంలో రైతుభరోసా సొమ్మును బదిలీ చేశారు.

కొందరికే ఇవ్వడంపై ఆందోళన

ఉమ్మడి జిలా వ్యాప్తంగా అర్హులైన రైతులకు ఏడాదికి ఎకరానికి రూ.12 వేల చొప్పున నగదు జమ చేసే ప్రక్రియ జనవరి 26వ తేదీ నుంచి ప్రభుత్వం మొదలు పెట్టింది. వానాకాలం, యాసంగి సీజన్‌లో రూ.6 వేల చొప్పున ఈ నగదును అందించనుంది. ప్రస్తుతం ప్రభుత్వం రూపొందించిన విధానాల ప్రకారం సాగులో ఉన్న, సాగుకు యోగ్యమైన భూములకు పెట్టుబడి సాయం అందుతుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాలను తొలి విడతలో ఒక్కో మండలంలో ఎంపిక చేసిన ఒక గ్రామంలో అర్హులైన అందరికీ పూర్తి స్థాయిలో వర్తింపజేసేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఎంపిక చేసిన గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను వర్తింపజేయగా, మాకెప్పుడు ఈ పథకాలన్నీ వస్తాయంటూ మిగతా గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను కొందరికి వర్తింపజేసి, కొందరికి ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేవలం 46 గ్రామాల రైతులకే..

రంగారెడ్డి జిల్లాలో మొత్తం 7,51,441 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా సాగుకు యోగ్యంగాలేని 50,119 ఎకరాలను గుర్తించారు. అలాగే సాగుకు యోగ్యమైనవిగా 7,01,322 ఎకరాలను గుర్తించారు. వికారాబాద్ జిల్లాలో సాగు భూములు 6,49,502 ఎకరాలు ఉండగా అందులో 7,496 ఎకరాలను సాగుకు యోగ్యం కాని భూములుగా గుర్తించారు. అలాగే మేడ్చల్ జిల్లాలో మొత్తం భూములు 79,280 ఎకరాలు ఉండగా 14,430 ఎకరాల భూములను సాగుయోగ్యంగా లేనట్లు గుర్తించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,128 గ్రామాలుండగా అందులో కేవలం 46 గ్రామాల రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందింది. మిగతా 1,082 గ్రామాల రైతులు పెట్టుబడి సాయానికి ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఏడాదిగా సాయం అందడం లేదు



టేకులపల్లిలో మాకు ఏడెకరాల భూమి ఉంది. పెట్టుబడి సాయం కింద ఒకసెల అటూ.. ఇటూ మా ఖాతాలో డబ్బులు పడుతుండేవి. ఏడాదవుతున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా రాలేదు. కొత్త ప్రభుత్వం హయాంలో ఇప్పటికే రెండుసార్లు రైతులు పెట్టుబడి సాయాన్ని కోల్పోయారు. మూడోసారైనా ఇస్తారనుకుంటే .. ఇప్పుడు కూడా ఎదురుచూపులు తప్పడం లేదు. ఎంపిక చేసిన ఒక గ్రామం రైతులకు ఇస్తే.. మిగతా రైతులకు ఎప్పుడు ఇస్తారు? ప్రభుత్వం ఇప్పటికైనా రైతులందరికీ రైతు భరోసా అందే విధంగా చర్యలు తీసుకోవాలి.

- జి.రామయ్య, రైతు, టేకులపల్లి, మోమిన్‌పేట్ మండలం, వికారాబాద్ జిల్లా

మాతా-శిశు ఆరోగ్య కేంద్రంలో

శిశువు మృతి

» డ్యూటీ డాక్టర్‌కు మెమో

తాండూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):తాండూరు-వికారాబాద్ రోడ్డులో గల మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో సోమవారం రాత్రి ఓ శిశువు మృతిచెందింది. పెద్దేముల్ మండలం తట్టెపల్లికి చెందిన రాజేశ్వరి మొదటి కాన్పు కోసం గత నెల 26న ఆస్పత్రిలో చేరింది. సోమవారం నార్మల్ డెలివరీ అయి ఆడబిడ్డను ప్రసవించింది. కొద్దిసేపటికే శిశువు అస్వస్థతకు గురై మృతిచెందగా తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. శిశువు మృతికి గల కారణాలపై డీసీహెచ్‌వో ప్రదీప్‌కుమార్ ఆదేశాల మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిశంకర్ విచారణ చేశారు. డ్యూటీ డాక్టర్ శ్రావణిని వివరణ కోరుతూ మెమో ఇచ్చారు. వైద్యురాలి తప్పని తేలితే చర్యలు తీసుకుంటామని డీసీహెచ్‌వో తెలిపారు. శిశువు శ్వాస ఆడక మృతిచెందినట్లు ప్రాథకంగా గుర్తించినట్లు ఆయన చెప్పారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

చేవెళ్ల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దేశంలోని పేదరిక నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం అన్నారు. మంగళవారం చేవెళ్లలో బీజేపీ నాయకులతో కలిసి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకరం చేశారు. అనంతరం హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. రత్నం మాట్లాడుతూ... దేశంలోని ప్రజలందరికీ ఉపయోగపడేలా కేంద్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఉద్యోగులకు రూ.12లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు గొప్ప విషయమన్నారు. వచ్చే ఐదేళ్లలో ప్రపంచ ఆర్థిక రంగంలో మనదేశం మూడో స్థానంలో నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, చేవెళ్ల మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి, ఉపాధ్యక్షుడు జి.కృష్ణాగౌడ్, నాయకులు వెంకట్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కుమార్, శ్రీనివాస్, బీజేవైఎం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

సన్మార్గంతోనే దైవానుగ్రహం

కడ్తాల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం చేస్తాయని, మనిషి సన్మార్గంలో పయనిస్తేనే దైవానుగ్రహం కలుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు కడ్తాల్‌లోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి వారితో మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించారు. అంతకు ముందు గ్రామంలో ఉత్సవ ఏర్పాట్లపై ఆలయ నిర్వాహకులు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పాలాది ఆంజనేయులు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వై.రాఘవేందర్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డిని నాయకులు శాలువాతో సత్కరించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు సైతం ఆలయ నిర్వాహకులు ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో మాధవులు, రాజు, వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, విజయ్‌రాథోడ్ ఉన్నారు.


ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

65 స్మార్ట్‌ఫోన్ల చోరీ

» మొబైల్ షాప్‌లో భారీ దొంగతనం

» రూ.15లక్షల విలువైన సామగ్రి అపహరణ



మొబైల్ షాప్‌ను పరిశీలిస్తున్న సీఐ రాజువర్మ, డీఐ శ్రీనివాస్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మొబైల్ షాప్‌లో భారీ చోరీ జరిగింది. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి మండలం, బోడుప్పల్, బృందావనం కాలనికి చెందిన బర్మ మల్లేశ్ పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ అయ్యప్పస్వామి దేవాలయం పక్కన మెయిన్ రోడ్డు వద్ద లక్ష్మీనర్సింహ పేరుతో మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆ దుకాణం పక్కనే ఉన్న రియల్ మీ మొబైల్ దుకాణం షెట్టర్ తాళంను మంగళవారం తెల్లవారుజామున దుండగులు పగులగొట్టి లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. తాళం వెళ్లకపోగా ఒక దుండగునికి కాలుకు గాయమైంది. ఆ వెంటనే పక్కనే లక్ష్మీనర్సింహ మొబైల్ దుకాణం షెట్టర్ తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అందులోని 67 స్మార్ట్ ఫోన్లతో పాటు 7 ఎల్‌సీడీ టీవీలు, బ్రాండెడ్ మొబైల్ ఫోన్ల సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఉదయం దుకాణం షెట్టర్ కొంత వరకు పైకి లేపి ఉండటాన్ని గమనించిన స్థానికులు మల్లేశ్‌కు సమాచారం అందించారు. దుకాణం వద్దకు చేరకొన్న ఆయన పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రాజువర్మ, డీఐ శ్రీనివాస్‌లు దుకాణాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ఇద్దరు దుండగులు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. రూ.15 లక్షల మేర విలువ చేసే ఫోన్లు, టీవీలు, సామగ్రి పోయిందని బాధితుడు మల్లేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భూ పొరల్లోని శబ్దాలకు భయాందోళన చెందొద్దు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డి.శశిధర్

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): భూమి పొరల మధ్య సర్దుబాటు జరిగినప్పుడు కొంత మేర శబ్దాలు వస్తాయని, వాటితో ఎలాంటి నష్టం జరగదని, ప్రజలు భయాందోళన చెందొద్దని ప్రిన్సిపాల్/సైంటిస్ట్ డి.శశిధర్ అన్నారు. మంగళవారం టేకుల్‌కోడ్ రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వారం రోజుల క్రితం టేకుల్‌కోడ్, అంగడి రాయచూర్, ధర్మాపూర్, అన్నారం, రుద్రారం, ఉప్పరిపల్లి గ్రామాల్లో భూప్రకంపనలు రావడంతో ప్రజలు తహసిల్దార్‌కు సమాచారం ఇచ్చారు. మైనింగ్, సంబంధిత అధికారులకు ఫోన్‌లో వివరించీరు. అధికారులు చేరుకుని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సైంటిస్ట్‌లు, మైనింగ్ అధికారులు మాట్లాడుతూ.. కొన్ని రోజుల క్రితం ఈ ప్రాంతంలో వచ్చిన భూకంపం రిక్టర్ స్కేల్‌పై 2.2పాయింట్లుగా నమోదైందని, ఇలాంటి స్వల్ప ప్రకంపనలతో ఎలాంటి నష్టం జరగదన్నారు. భూ పొరల్లో సర్దుబాటు జరిగే సమయాల్లో శబ్దాలు వస్తాయని తెలిపారు. భూకంపాలపై ప్రజలకు సమాచార బుక్‌లెట్లు అందించారు. సమావేశంలో జి.సురేష్, టెక్నికల్ ఆఫీసర్ నరేష్, ఏడీ సత్యనారాయణ, తహసీల్దార్ విజయకుమార్, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై జీవీ.సత్యనారాయణ, అధికారులు రాఘవేందర్, చైతన్యకుమార్, ప్రజలు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

మద్యం తాగించి, బండరాళ్లతో మోది హతమార్చిన దుండగులు

» బషీరాబాద్ మండలం

నవాల్గ శివారులో ఘటన


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ బాలక్రిష్ణారెడ్డి, సీఐ, ఎస్ఐలు

బషీరాబాద్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడికి మద్యం తాగించి గొంతు నులిమి, బండరాయితో మోది దారుణహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన బషీరాబాద్ మండలం నవాల్గ శివారులోని ప్రధాన రోడ్డు మార్గం పక్కన మంగళవారం ఉదయం వెలుగుచూసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నవాల్గ గ్రామానికి చెందిన మాల శామప్ప(31) బషీరాబాద్-తాండూరు ప్రధానం మార్గం తాతగూడి సమీపంలో ఓ చెట్టు కింద మృతదేహమై కనిపించాడు. సమాచారం అందుకున్న బషీరాబాద్ ఎస్ఐ శంకర్, సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆ వెంటనే ఎస్ఐ శంకర్.. తాండూరు డీఎస్పీ బాలక్రిష్ణారెడ్డి, సీఐ నగేష్‌కు సమాచారం ఇచ్చారు. సోమవారం రాత్రి వేళ అక్కడి వ్యవసాయ పొలం మధ్యలో శామప్పతో పాటు మరికొందరు మద్యం తాగినట్లు గుర్తించారు. అక్కడే శామప్పను హత్య చేసి శవాన్ని 100 మీటర్ల దూరంలోని చెట్ల వద్దకు లాక్కొచ్చి బండరాయితో మోది హత్య చేసి పడేసినట్లు నిర్ధారణకు వచ్చారు. అలాగే హత్య జరిగిన చోట పలు ఆధారాలు సేకరించారు. అనుమానంతో అక్కడే ఉన్న మృతుడి వదిన సుగుణమ్మను పోలీసులు లోతుగా విచారించారు. ఇంటి విషయంలో మృతుడు శామప్ప, అన్న నర్సింహులు కుటుంబాల మధ్య గొడవలున్నాయని, ఈ కారణంతోనే అడ్డు తొలగించుకునేందుకు వదిన హత్య చేయించినట్లు తేల్చిన పోలీసులు విషయాన్ని గోప్యంగా ఉంచారు. డీఎస్పీ నేతృత్వంలో రూరల్ సీఐ, ఎస్ఐలు ఘటన స్థలం వద్ద లభించిన ఆధారాలతో విచారణ మరింత ముమ్మరం చేస్తూ రెండు గంటల్లోనే హంతకులెవరానేది తేల్చారు. కాగా హత్య చేసేందుకు మృతుడి వదిన స్థానికంగా ముగ్గురు వ్యక్తులకు రూ.50 వేల సూపారి మాట్లాడి రూ.10 వేలు అడ్వాన్సుగా ఇచ్చినట్లు పోలీసుల విచారణలో బయట పడినట్లు సమాచారం. ఈ హత్య కేసులో కీలక ఆధారాలు పోలీసులకు లభించడంతో అక్కడికక్కడే మృతుడి వదినతో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.మృతుడి చెల్లెలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నగేష్ వెల్లడించారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

ఆమనగల్లు , ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శంకర్‌నాయక్‌ను మంగళవారం బీజేపీ సీనియర్ నాయకులు శ్రీకాంత్ సింగ్, కృష్ణనాయక్, శ్రీశైలం యాదవ్ లు మర్యాద పూర్వకంగా కలిశారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయనకు పూల మాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. మున్సిపాలిటీ అభివృద్ధి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

సత్కారం

చేవెళ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మున్సిపాలిటీ నూతన కమిషనర్ పూర్ణచందర్‌ను కాంగ్రెస్ చేవెళ్ల మండల నాయకులు సన్మానించారు. మంగళవారం చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బండారు శైలజా ఆగిరెడ్డి పలువురు నాయకులు కమిషనర్ కార్యాలయంలో ఆయనను మార్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూర్ణచందర్‌ను శాలువ, బొకేతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, దుర్గప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐకి అభినందనలు



ఎస్ఐ యాదయ్యు ను సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు , ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏఎస్ఐ నుంచి ఎస్ఐగా పదోన్నతి పొందిన యాదయ్య కు మంగళవారం స్థానిక నాయకులు అభినందనలు తెలిపారు. స్టేషన్‌లో ఆయనను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. విధి నిర్వహణను అంకిత భావంతో నిర్వహిస్తూ ప్రజల అభిమానం చురగొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వడ్డె రాజు, అశోక్, జెనిగల గిరి,మహేశ్, గోపి, అమర్, తదితరులు ఉన్నారు.

96వ రోజు దీక్షలు




దీక్షలో జేఏసీ నాయకులు

తలకొండపల్లి , ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 96వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నేతలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆ మేరకు సంఘీభావంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసే 11 కొత్త మండలాల్లో గట్టిప్పలపల్లిని చేర్చాలని జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్లు శరత్ చంద్ర, ఆంజనేయులు గౌడ్‌లు డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వరకు గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని తెలిపారు. తొమ్మిది గ్రామ పంచాయతీలను కలిపి మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు , గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవ స్వామి కల్యాణం

ఆమనగల్లు , ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెన్నకేశవ స్వామి దేవాలయంలో మంగళవారం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. భక్తులకు నిర్వాహకులు మౌలిక సదుపాయాలు కల్పించారు. అనంతరం బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించిన కల్యాణంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కాలే మల్లయ్య, ఎనుమల రమేశ్, గోరటి దేవేందర్, కోరే రవి, నర్సింహా, మొగులయ్య, యాట ముత్యాలు, గుండమల్ల జగన్, కామల్ల ప్రకాశ్, కాలే శివ, రవి, గోరటి నర్సింహా, లండం చంద్రయ్య, కృష్ణయ్య, పర్వతాలు, సాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడాలి



బోరుమోటారును ప్రారంభిస్తున్న ఏఈ

షాబాద్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : వేసవి సమీపిస్తున్న తరుణంలో తాగు నీటిని పొదుపుగా వాడుకోవాలని మిషన్ భగీరథ ఏఈ చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొమరబండలో రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని బోరుమోటారును వాడుకలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామస్థులు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. గ్రామాల్లో పర్యటించి తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూస్తానని, ఏమైనా తాగునీటి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శంకర్, గ్రామస్థులు సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు బస్టాండ్ విస్తరించేదెన్నడో?

- ప్రయాణికులకు మౌలిక సదుపాయాల కొరత
- ప్రతిపాదనలకే క్యాంటీన్ పరిమితం
- పట్టించుకోని అధికారులు



ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్

ఆమనగల్లు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, అభివృద్ధి గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. ఆదాయం బాగున్నా విస్తరణపై దృష్టి సారించడంలేదని ప్రయాణికులు వాపోయారు. అలాగే కనీస మౌలికసదుపాయాలు లేక వారు సతమతమవుతున్నారు.

ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస వసతులు కరువయ్యాయి. వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయలేదు. నీళ్ల బాటిళ్లు, ప్యాకెట్లు కొని దాహం తీర్చుకుంటున్న పరిస్థితి నెలకొంది. ప్రతిపాదనలకే క్యాంటీన్ పరిమితమైంది. ప్రధాన రహదారిపై గల హోటల్స్‌కు వెళ్లాల్సి వస్తుంది. కూర్చోవడానికి బెంచీలు, సరైన సదుపాయాలు కూడా లేవు. దీంతో పలు సందర్భాలలో కొందరు ప్రయాణికులు బస్టాండ్‌లో ఉంచిన విలువైన వస్తువులు పోగొట్టుకున్న సందర్భాలూ ఉన్నాయి. అలాగే బస్టాండ్ ప్రధాన ద్వారం వద్ద సీసీరోడ్డు లేక కంకర తేలి, గోతులు ఏర్పడ్డాయి. అసలే ఇరుకుగా ఉన్న బస్టాండ్‌లో ఓ వైపు చెట్లు, మరో వైపు వాహనాల పార్కింగ్ , దుకాణాల ఏర్పాటుతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయమై ఆర్టీసీ అధికారుల తీరు మీద విమర్శలు వస్తున్నాయి. ఇక ఆమనగల్లు బస్టాండ్ మీదుగా శ్రీశైలం, హైదరాబాద్, యాదగిరి గుట్ట, సంగారెడ్డి, వరంగల్, నర్సంపేట, మాల్, దేవరకొండ, కల్వకుర్తి, అచ్చంపేట, మహబూబ్‌నగర్, కర్ణాటక, కొల్లాపూర్ , గోదావరిఖని, షాద్‌నగర్, నారాయణఖేడ్ వంటి దూర ప్రాంతాలకు నిత్యం వందల సంఖ్యలో బస్సులు నడుస్తుంటాయి. వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆదాయం బాగున్నా గానీ సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌ను విస్తరించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి



ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్‌ను విస్తరించాలని దశాబ్దంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెసున్నాం. ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించాం. అయినా స్పందన లేదు. కల్వకుర్తి ఆర్టీసీ డిపోకు ప్రధాన ఆదాయ మార్గమైన ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్ విస్తరించి ప్రయాణికులకనుగుణంగా సదుపాయాలు కల్పించాలి. ఈ విషయంలో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

కండె హరిప్రసాద్, ఆమనగల్లు మాజీ జెడ్పీటీసీ

మోదీ, నిర్మల చిత్రపటాలకు పాలాభిషేకం



చేవెళ్ల: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు



ఆమనగల్లు: మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విక్రమ్ రెడ్డి, శ్రీను, బీజేపీ నాయకులు

ఆమనగల్లు , చేవెళ్ల, షాద్‌నగర్, చౌదరిగూడ, కేశంపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి రూ.12.75 లక్షల వరకు పెంచడాన్ని హర్షిస్తూ జిల్లాలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబురాలు జరుపుకొన్నారు. ప్రధాని మోదీ, నిర్మల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. చేవెళ్లలో.. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం మాట్లాడారు. దేశంలోని పేదరిక నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉందని తెలిపారు. అలాగే షాద్‌నగర్ చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజలు పండుగ చేసుకుంటుంటే... కాంగ్రెస్‌కు మాత్రం కడుపు మండుతోందని విమర్శించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

సంక్షిప్తం..

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

శంకర్‌పల్లి, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని యానగింది మాణికేశ్వరీ మాత శిష్యులు శివయ్య స్వామి తెలిపారు. కొత్తపల్లిలోని మానికేశ్వరీ మాత ఆలయంలో మంగళవారం మహాగాయత్రి యజ్ఞం జరిగింది. అనంతరం ఆయన భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. జీవహింస మహాపాపమని ఉద్ఘాటించారు. మాంసాహారానికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి హరిశంకర్, కోశాధికారి విశ్వంచారి, సలహాదారుడు మాణిక్యం చారి, సభ్యులు లింగారెడ్డి, ధారం నర్సింహులు, ఆనందం తదితరులు ఉన్నారు.

36,639 మంది ఓటర్లు

కేశంపేట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కేశంపేట ఎంపీడీఓ రవిచంద్రకుమార్ రెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 36,639ఓటర్లు ఉన్నారన్నారు. పురుషులు 18,158, మహిళలు 18,480, ఒక టాన్స్‌జెండర్ ఉన్నారని తెలిపారు. ఎన్నికల జాబితాలో 333 ఓటర్లు కొత్తగా నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కిష్టయ్య, ఇన్‌చార్జీ ఎంఈవో చంద్రశేఖర్, నాయకులు తలసాని వెంకట్ రెడ్డి, ఆంజనేయులు, నవీన్ కుమార్, కోడూరు రాములు, రొల్లు రాఘురాములు గౌడ్, యుగందర్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలోనూ..

తలకొండపల్లి , ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 32 గ్రామ పంచాయతీల పరిధిలోని 272 వార్డులలో 37,385 మంది ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీవో శ్రీకాంత్ తెలిపారు. మంళవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. పురుష ఓటర్లు 19,082, స్త్రీ ఓటర్లు 18,702, ట్రాన్స్ జెండర్ ఒకరు ఉన్నట్లు వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంఈవోకు వినతి

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఎంఈవోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు నీరటి మల్లేశ్ మాట్లాడుతూ 7 నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కుటుంబపోషణకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులను వెంటనే ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. గణేశ్, భారతమ్మ, శివలీ, రాజు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ భగ్నం



చౌదరిగూడ: అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు



కేశంపేటలో..

చౌదరిగూడ, కేశంపేట, షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ చలో హైదరాబాద్ పోరుబాట కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. మంగళవారం ఎక్కడికక్కడా మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్టులు చేసి ఠాణాలకు తరలించారు. ఈ సందర్భంగా అక్రమ అరెస్టులు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం వెంటనే సర్పంచ్‌ల పెండింగ్ బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు.



షాద్‌నగర్ రూరల్ : పోలీస్‌స్టేషన్‌లో..

బీఆర్ఎస్‌వి అవకాశవాద రాజకీయాలు

ఆమనగల్లు , ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజావిశ్వాసం కోల్పోయి అధికారానికి దూరమైన బీఆర్ఎస్ నాయకులు ఉనికి కోసం అవకాశవాద రాజకీయాలు, దుష్ప్రచారాలు సాగిస్తున్నారని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం రాష్ట్రంలో బీఆర్ఎస్ , బీజేపీ పార్టీలు ఉనికి లేకుండా పోతాయని పేర్కొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ చంద్రాయన్‌పల్లి తండాలో మంగళవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మానయ్య అధ్యక్షతన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం పలువురు బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కేశవులు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణనాయక్, తండా అధ్యక్షుడు రాగ్యానాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ కార్యదర్శిగా మహేందర్‌రెడ్డి



మహేందర్‌రెడ్డికి నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు. ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యదర్శిగా కందుకూరు మండలం కొత్తగూడ గ్రామానికి చెందిన చామ మహేందర్‌రెడ్డి నియమితులయ్యారు. మంగళవారం ఎమ్మెల్యే "సబితారెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వి వరించాలన్నారు. దివ్యాంగులకు నెలకు రూ. 6వేల పింఛన్ అందిస్తామని ఎన్నికల ముందు మాట ఇచ్చి వారిని మోసం చేయలేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీమిడి జంగా రెడ్డి, దశరథ, సురేందర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

పాఠశాలలో స్వయం పాలన



స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

యాచారం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండలం మాల్‌లోని శాంతినికేతన్ పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవం జరుపుకొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, కలెక్టర్‌గా, డీఈవోగా, ఎంఈవోగా తదితర పాత్రలను నిర్వహించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

కనుల పండువగా రథోత్సవం



రథం లాగుతున్న భక్తులు

తలకొండపల్లి , ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. మంగళవారం స్వామి వారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలపండి

యాచారం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : ఓటర్ జాబితాపై తమ అభ్యంతరాలను తెలపాలని, ఇంకా అనుమానాలుంటే తమకు వివరించాలని యాచారం ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం ఓటర్ జాబితాపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో మాట్లాడారు. తుది జాబితాను కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విడుదల చేశామన్నారు. జాబితాపై ఎలాంటి అనుమానాలకు తావులేకుండా తుది జాబితా విడుదల చేశామన్నారు. మార్పులు చేర్పులుంటే వివరించాలన్నారు. ఒ క కుటుంబ సభ్యులందరూ ఒకే వార్డులో ఉండేటట్లు చూడాలని బీజేపీ మండల అధ్యక్షుడుతాండ్ర రవీందర్ కోరారు.

పార్కు స్థలంలో వాటర్ ట్యాంక్ నిర్మించవద్దు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): బొప్పన్న వెంచర్‌లోని పార్కు స్థలంలో వాటర్‌ట్యాంకు నిర్మించవద్దని కాలనీ వాసులు కోరారు. పార్కు స్థలంలో వాటర్‌ట్యాంకు నిర్మించవద్దని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ యోగేష్‌కు వినతిపత్రం అందజేశారు. శంకర్‌పల్లి మున్సిపల్‌లోని బొప్పన్న వెంచర్‌లో పార్కుకు కేటాయించిన స్థలంలో డ్రైనేజీ నిర్మించామన్నారు. అమృత్ 2.0 కింద మంజూరైన వాటర్ ట్యాంకును బొప్పన్న వెంచర్‌లో నిర్మించవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

క్రైం కార్నర్

అదృశ్యమైన వ్యక్తి విగతజీవిగా..



రంగయ్య (ఫైల్)

యాచారం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన వృద్ధుడు శవమై కనిపించాడు. ఈ సంఘటన యాచారంలో మంగళవారం జరిగింది. చౌదర్‌పల్లికి చెందిన వృద్ధుడు గడెల రంగయ్య సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకెళ్లారు. ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు రెండు రోజులపాటు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోయింది. ఆయన కనిపించకుండా పోయాడని మంగళవారం కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఒక బావిలో వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించారు. ప్రొక్లెయిన్ సాయంతో బావి నుంచి శవం బయటకు తీశారు.

కారు బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు



గాయపడిన యువకుడు, యువతి

కేశంపేట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కారు బైక్ ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన వేముల్‌నర్వ గ్రామశివారులో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వేముల్‌నర్వ గ్రామ పంచాయతీ బలిజరాళ్లతండాకు చెందిన కాట్రావత్ దేవేందర్ ఇదే తండాకు చెందిన యువతితో కలిసి మంగళవారం ఉదయం స్కూటీపై షాద్‌నగర్ వైపు వెళ్తున్నాడు. సుందరాపురానికి చెందిన ఓ కుటుంబం షాద్‌నగర్ నుంచి కేశంపేటకు వస్తుండగా మార్గ మధ్యలో వాడ్యాల పర్వత్ రెడ్డి వ్యవసాయ భూమి వద్ద బైక్, కారు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. మొక్కజొన్నకు ఏర్పాటు చేసిన స్ప్రింక్లర్ నీటి తుంపరాను తప్పించుకోవడానికి ర్యాంగ్ రూట్‌లో ముందుకు వెళ్లడంతోనే స్కూటీపై వెళ్తున్న వారికి ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ ఘటనలో దేవేందర్, యువతి గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వ్యసనాలను అలవర్చుకోవద్దు

యాచారం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు విద్యార్థులకు సూచించారు. మంగళవారం యాచారం మండలంలో ఉన్న మేడిపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజు మాట్లాడుతూ మొబైల్‌ఫోన్‌లు వాడరాదన్నారు. తరచూ వాటిని వినియోగిస్తే చదివింది మరవడం ఖాయమనే విషయం గమనించాలన్నారు. తమకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

అభివృద్ధికి తోడ్పాటునందించాలి



మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా మొయిజుద్దీన్‌ను కలిసిన అజీజ్‌నగర్ మాజీ సర్పంచ్ సంధ్యశ్రీశైలం

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో విలీనమైన అజీజ్‌నగర్ గ్రామాభివృద్ధికి ప్రత్యేక తోడ్పాటును అందించాలని మాజీ సర్పంచ్ బండ్లగూడ సంధ్యశ్రీశైలం కోరారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా మొయిజుద్దీన్‌ను మంగళవారం ఆమె మర్యాదపూర్వకంగా కలిసి ఆపై సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా తమ గ్రామం మున్సిపాలిటీలో విలీనమైనప్పటికీ గ్రామాభివృద్ధికి ప్రత్యేక తోడ్పాటును అందించాలని కోరారు. ఆయనను కలిసి వారిలో నాయకులు బండ్లగూడ శ్రీశైలం, అల్లం మాణిక్‌రెడ్డి, మాడి రాంచంద్రారెడ్డి, చెంగలి వెంకట్‌రెడ్డి, రఘుపతి, రాజు తదితరులు ఉన్నారు.

మౌలిక సదుపాయాల కోసం కృషి

ఆదిభట్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజోతి): మున్సిపాలిటీలో ప్రజలకు కావలిసిన మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తానని కమిషనర్ బాలకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలో సాహెబ్‌గూడలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని దశాలవారీగా పరిష్కరించి పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యులు జహంగీర్‌ఖాన్, వి. రాములుగౌడ్, నరసింహగౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నవీన్, యూత్ యువసేన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మూడో బెటాలియన్ ఆధ్వర్యంలో శ్రమదానం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం నుంచి నాగనపల్లి రహదారిలో ఇబ్రహీంపట్నం టీజీఎస్పీ 3వ బెటాలియన్ సిబ్బంది మంగళవారం శ్రమదానం చేసి గుంతలను పూడ్చింది. రోడ్డుకిరువైపులా పిచ్చి మొక్కలను తొలగించి రోడ్డు పక్కన గుంతలను పూడ్చి చదును చేశారు. కార్యక్రమంలో టీజీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ జమీల్ పాషా, అడిషనల్ కమాండెంట్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమాండెంట్లు కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని శంకర్‌పల్లి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శంకర్‌పల్లి మున్సిపల్‌లోని బాలురు, బాలికల ప్రాథమిక పాఠశాలల్లోని మంగళవారం విద్యార్థులకు ప్యాడ్‌లను అందజేశారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ యోగేష్ ఉన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం

చౌదరిగూడ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మహిళల ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని కొందుర్గు జీహెచ్ఎం గోపినాథ్ అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లాలో నిర్వహించిన కుంగ్‌ఫూ కరాటే పోటీలో కొందుర్గు ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరాటే ఆత్మరక్షణతో పాటు సంపూర్ణ ఆరోగ్యం, శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని అన్నారు. లక్ష్మీకాంత్‌రెడ్డి, మాస్టర్ రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం

చౌదరిగూడ,ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వంద రోజుల్లో ఆరుగ్యారెంటీల అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాది పూర్తయినా వాటిని అమలు చేయడం లేదని బీజేపీ మండలాధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం కొందుర్గు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికే తన నిజస్వరూపాన్ని బహిర్గతం చేసిందన్నారు.

పార్టీ నేతలతో వేర్వేరుగా సమావేశం

చౌదరిగూడ ,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): వివిధ రాజకీయపార్టీ నేతలతో వేర్వేరుగా అఖిలపక్షం నిర్వహించడంపై విమర్శలు వస్తున్నాయి. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని పార్టీలతో కాకుండా విడివిడిగా నిర్వహించారు. ఎంపీడీవో లక్ష్మీ అనురాధ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మొదట బీఆర్ఎస్ నాయకులతో, తర్వాత కాంగ్రెస్, బీజేపీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించగా, ఇలా ఎందుకు నిర్వహించారో అర్థకాలేదని పలువురు చర్చించుకున్నారు.